అనంతపురం రూరల్

ఆంధ్రజ్యోతి

బుధవారం 08-09-2010 11

# ఫ్యాక్టరీ పొల్యూషన్‌పై ఆర్డీఓ విచారణ

పామిడి,సెప్టెంబర్7(ఆన్‌లైన్) మండల పరిధిలోని పాళ్యం గ్రామంలో ఫ్యాక్టరీ పొల్యూషన్‌పై విచారించేందుకు ఆర్డీఓ గౌతమి వచ్చారు. గ్రామంలోని ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలనుంచి స్థానికంగా వచ్చిన ఫిర్యాదులపై విచారించారు. ఫ్యాక్టరీ నడపకూడదంటూ ఆదేశించినా ఎందుకు నడుపుతున్నారంటూ యజమానిపై మండిపడ్డారు. కర్నూల్ పొల్యూషన్ కంట్రోల్ శాఖ నివేదించే వరకు ఫ్యాక్టరీ నడపకూడదని సూచించారు. ఫ్యాక్టరీ సమీపంలో వున్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఏవిధంగా ఇబ్బంది పడుతున్నది ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. స్థానికంగా ఫిర్యాదు చేసిన వ్యక్తులు, ఫ్యాక్టరీ నిర్వాహకులు మధ్య పరస్పరం వాదనకు దిగడంపై ఆర్డీఓ అభ్యంతరం వ్యక్తపరిచారు. స్థానికంగా వుండేది మీరు సమస్యలు ఏవైనా వస్తే పరిష్కారం చేసుకోవడం పోయి గొడవలకు దిగవద్దంటూ వివరించారు. పొల్యూషన్ శాఖ ఇచ్చే నివేదిక తరువాత తదుపరి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు. అంతవరకు ఫ్యాక్టరీ నడపకూడదంటూ నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మినాయక్, ఆర్ఐ హరిప్రియ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.






శింగనమల, అనంతపురం, కూడేరు, పామిడిలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కార్మికులు

# సార్వత్రిక సమ్మె ప్రశాంతం

పామిడి,సెప్టెంబర్7(ఆన్‌లైన్) అసంఘటిత రంగ కార్మికులకు కాంట్రాక్ట్, క్యాజువల్ ఉద్యోగులకు సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలని దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. సమ్మెకు మద్దతుగా ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. పామిడి గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి బీసీసీ రోడ్డుమీదుగా సీఐటియు అనుబంధ సఘాలు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని ధర్నా చేశారు. నినాదాలు చేశారు. తహసీల్దార్ లక్ష్మినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు అనిమిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షులు శైలజాకుమారి, సుజాత, ఐకేపీ విభాగం నాయకులు బాషా, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భానుమతి, భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు ముత్యాలు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు, పెద్ద నరసింహులు, నాగేంద్రప్రసాద్, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

**అనంతపురం రూరల్...**

అనంతపురంరూరల్,సెప్టెంబర్7(ఆన్‌లైన్): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన జాతీయ సమ్మెలో భాగంగా రూరల్ మండల పరిధిలోని బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు బంద్ చేశారు. కందుకూరు ఎఫ్‌సీ గౌడౌన్‌లో మాత్రం యథావిధిగా పనులు నిర్వహించారు. చియ్యేడులోని సిండికేట్ బ్యాంక్‌తో పాటు మరిన్ని బ్యాంకులు బంద్ చేశారు.

**రాప్తాడులో...**

రాప్తాడు,సెప్టెంబర్7(ఆన్‌లైన్) మండల కేంద్రంలో పలు దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలను సీఐటీయు, సీపీఎం నాయకులు మంగళవారం బంద్ చేయించారు. ఈసందర్భంగా సీఐటియు కార్యదర్శి రఘు మాట్లాడారు. ఆకాశాన్నంటుతున్న ధరలను నియంత్రించి ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంక్షోభం పేరున పెట్టుబడి దారులకు లక్షలకోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం... కార్మికులకు ఉపాధి శిక్షణకై చర్యలు చేపట్టాలని, చట్టాల అమలుకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దిరెడ్డి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు కవితమ్మ, రామాంజినమ్మ, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్, మురళి, విజయమ్మ, నాగన్న, ఈరప్ప, వీఆర్వో సంఘం నాయకులు నరసింహ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**శింగనమలలో...**

శింగనమల,సెప్టెంబర్7(ఆన్‌లైన్) ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతూ కార్మికులపై భారం వేస్తున్నాయని,ధరలను నియంత్రించకుంటే పోరాటాలకైనా సిద్ధమని సీపీఎం నాయకులు హెచ్చరించారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీనిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాలరంగయ్య, నాయకులు చెన్నప్పరెడ్డి, బాలరంగయ్య, సీఐటియు నాయకులు నాగరాజు, వరలక్ష్మి, ప్రమీలా, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హమాలీ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రంలో...**

బుక్కరాయసముద్రం,సెప్టెంబర్7(ఆన్‌లైన్): నిత్యావసర సరుకుల ధరలు తగ్గించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సీపీఎం, సీఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల సీపీఎం, సీఐటియు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీనిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు ఓ.నల్లప్ప, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు వనజ మాట్లాడారు. వెటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాగే కొనసాగితే ప్రజలే ప్రభుత్వాలకు బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గ్రామ పంచాయతీ వర్కర్స్ నారాయణస్వామి, కొండన్న, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, హమాలీ యూనియన్ నాయకుడు రుద్రప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు, హమాలీ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**కూడేరులో...**

కూడేరు,సెప్టెంబర్7(ఆన్‌లైన్) ధరలు నియంత్రించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలంటూ తలపెట్టిన సమ్మె విజయవంతమైంది. సీఐటియు, ప్రజాసంఘాలు, అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ తదితర కార్మిక వర్గాలు ఆందోళన చేపట్టాయి. ఎంపీడీఓ కార్యాలయం నుంచి కళ్ళగళ్ళ రోడ్డు వరకు ర్యాలీగా వెళ్ళి అనంతరం రోడ్డుపై బైఠాయించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమస్యలపై చర్చించారు. సీపీఎం మండల కార్యదర్శి నగేష్, వైస్ ఎంపీపీ జల్లప్ప, కుంటెన్న, మల్లికార్జున, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరులో...**

ఆత్మకూరు,సెప్టెంబర్7(ఆన్‌లైన్) కార్మికుల ప్రయోజనాలకంటే కంపెనీల, బడాబాబుల ప్రయోజనాలకే యూపీఏ ప్రభుత్వం కట్టుబడిందని సీఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. ఆత్మకూరులో మంగళవారం కార్మికులతో వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలు సాధారణ ప్రజలు కార్మికుల జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ధరలు నివారించడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండలాధ్యక్షుడు సర్దానప్ప, కార్యదర్శి నాగరాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, రామాంజి, మల్లికార్జున, సర్దానప్ప, రామచంద్ర, శశిధర్, ఆటోయూనియన్ నాయకులు జయచంద్ర, శివ, అశోక్, తిరుపాలు, హమాలీ నాయకులు శేఖర్, అంగన్‌వాడీ వర్కర్‌స ఎండీంఎ వర్కర్‌స, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, కేవీపీఎస్ నాయకులు సోమశేఖర్, రైతు సంఘం నాయకులు రాము పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో...**

ఆత్మకూరు,సెప్టెంబర్7(ఆన్‌లైన్) తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ప్రైవేటీకరణ, 41. 42 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వయస్సు మీరిన వర్కర్లకు పింఛను సౌకర్యంతో పాటు ప్రతి నెలా జీతాలు సక్రమంగా అందజేయాలని కోరారు. నాలుగోతరగతి ఉద్యోగులుగా గుర్తించి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రమాదేవి, ఉపాధ్యక్షులు తులసమ్మ, కమిటీ సభ్యులు కాంతమ్మ, లక్ష్మినరసమ్మ, శంకరమ్మ, విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**గార్లదిన్నెలో...**

పామిడి,సెప్టెంబర్7(ఆన్‌లైన్) దేశ వ్యాప్తసమ్మెలో భాగంగా గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్ళి ఈ కార్యక్రమం చేశారు. 5డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ గౌతమికి ఇచ్చారు. ఈకార్యక్రమంలో సీఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం డివిజనల్‌కార్యదర్శి రాయుడు, మండల నాయకులు అక్బర్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, ఆటో, హమాలీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పింఛను కోసం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరీక్షిస్తున్న వృద్ధులు

# పాపం వృద్ధులు.. అర్హులైనా అందని పింఛను

పామిడి,సెప్టెంబర్7(ఆన్‌లైన్) అధికారుల నివేదికలో లోపమో...ప్రభుత్వ సూచనలో భాగమో తెలియదు కానీ అర్హులైన పెన్షన్ల తొలగింపుతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బోగస్ పెన్షన్ల తొలగింపు ప్రక్రియలో భాగంలో అర్హులను తొలగించడం వల్ల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ముందు ఇబ్బడి ముబ్బడిగా పార్టీ వర్గాలు చెప్పిన వారందరినీ అధికారులు గుర్తించి పెన్షన్లు మంజూరు చేశారు. మంజూరైన వాటిలో అనర్హులను తొలగించాలన్న ఆదేశాలు ఏవిధంగా వున్నాయో తెలియదు. రేషన్ కార్డులలో వయస్సు తక్కువ వున్న వారందరినీ తొలగించడం వల్ల వితంతువులను తొలగించారు. పామిడి మండలంలో 8110 పెన్షన్లు వస్తుండేవి. వాటిలో 2140 మంది అనర్హులుగా తొలగించారు. వృద్దులకు రూ.20లు పెన్షన్ ఇస్తున్నప్పటి నుంచి లబ్ధిపొందుతున్న వారిని సైతం తొలగించారు. వితంతు పెన్షన్ పొందుతున్న మహిళలు భర్త మృతి చెందినప్పుడు గ్రామ పంచాయతీలలో నమోదు చేయించకపోవడం వల్ల మరణ ధృవీకరణ పత్రాలు వారి వద్ద లేవు. అటువంటి వారికే గ్రామ పంచాయతీ పాలకవర్గం విచారించి ధృవీకరణ పత్రాలను జతపరచి జాబితా పంపాలంటూ డీఆర్‌డీఏ సూచించింది. అర్హులందరికీ భర్త మృతి చెందినట్లుగా ధృవీకరణ పత్రాలను జతపరచి జాబితాలను పామిడి గ్రామపంచాయతీ నుంచి మండల పరిషత్ కార్యాలయానికి ఇచ్చిన వాటిని తిరస్కరించినట్లు సమాచారం. అర్హులు మాత్రం వికలాంగులకు ధృవీకరణ పత్రాలు జతపరచకపోయినా అధికారులు వృద్ధాప్య పెన్షన్‌గా నమోదు చేసి పంపిణీ చేసినవి తొలగించారు. వారికి రేషన్ కార్డుల్లో వయస్సు తేడాలున్నాయంటూ డీఆర్‌డీఏ నుంచి తొలగించినట్లుగా స్పష్టమవుతోంది. అధికారుల రేషన్‌కార్డుల మేరకు తొలగిస్తే వితంతువులు, వికలాంగులు ధృవీకరణ పత్రాలు మంజూరు చేయించి లబ్ధిపొందేలా చూడాలని అర్హులంతా ఆందోళనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరమెంతైనా వుంది.

**కొడుకులున్నా చూసేవారులు లేదు**

**తిమ్మక్క, నెమళ్లపల్లి**



కొడుకులున్నా ముద్ద బువ్వ పెట్టేవారు లేరు. ఏదో పెన్షన్ వస్తోంది వాటితో నెల ఖర్చులు చూసుకుంటున్నాను. అది కూడా 4నెలల క్రితం తొలగించారు. ప్రభుత్వ సాయం లేదు. వృద్దాప్యంలో ఏపని చెయ్యలేదు. ఆఫీసర్ల దగ్గరకు పొయ్యి చెప్పుకుంటూనే వున్నాను.

**కొడుకు, కోడలు నెట్టేశారు**

**హనుమక్క, ఆర్డీ తాండా**



కొడుకు కొడలు ఇంట్లోంచి నెట్టేశారు. ఇతరుల ఇళ్ళవద్ద అన్నం తిని బతుకుతున్నాను. ఏదో పెన్షన్ వస్తోందనుకుంటే అది కూడా అది కూడా రద్దు చేశారు. భర్త మృతి చెందినట్లు ధృవీకరణ పత్రం లేదు. ఎలాగైనా పెన్షన్ ఇప్పించండి

**భర్త లేరు..ధృవపత్రమూ లేదు**

**దుర్గమ్మ, దుర్గమ్మ వీధి, పామిడి**



ప్రభుత్వం నుంచి రూ.20లు నుంచి పెన్షన్ పొందుతున్నా. భర్త మృతి చెందినట్లు ధృవ పత్రం లేదు. ఇప్పుడేమో అది వుంటే పెన్షన్ అంటే ఎలా. ఆఫీసర్లే న్యాయం చేయాలి.

**అర్హులను గుర్తిస్తున్నాం**

**జయరాములు, ఎంపీడీఓ**

పెన్షన్ రద్దయిన వాటిలో అర్హులను గుర్తించి లబ్ధిపొందేలా చూస్తాం. పూర్తి వివరాలు సేకరిస్తున్నాం. గ్రామ కార్యదర్శులతో విచారిస్తున్నాం. తొలగించిన వాటిలో 64 అర్హులుగా నివేదిక పంపాం. పూర్తిగా విచారించి అర్హులందరికీ పెన్షన్ వచ్చేలా చూస్తాం. ఎలాంటి ఆందోళన అవసరం లేదు.